క్లుప్తంగా

సురక్షిత విధానాలు అనుసరించాలి



సేఫ్టీ కిట్లు పంపిణీ చేస్తున్న దాతలు, అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విధి నిర్వమణలో ప్రతి లైన్‌మెన్ అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత విధానాలు అనుసరించాలని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు సూచించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ 2 కార్మికులకు సేఫ్టీ కిట్లను దాతల సహకారంతో ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ సారథ్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేసే లైన్‌మెన్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. ఏడీఈలు పి.రాజ్ కుమార్, ఎల్‌వీ శ్రీనివాస్, కె.గోపాలకృష్ణ, ఐవీ మల్లేశ్వరరావు, ఆర్ భీమేశ్వరరావు, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు తురగా రామకృష్ణ, భూక్యా నాగేశ్వరరావు, ఎం రమేష్, సీహెచ్ సాయిబాబా, బలుసు బాబు, అబ్బాస్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు భక్తుల విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. అమ్మవారి నిత్యాన్నదానానికి నిడమానూరుకు చెందిన శివరామకృష్ణ ప్రసాద్, జ్యేష్ఠ దంపతులు రూ.లక్ష, ఏలూరుకు చెందిన పి.శ్రీరామ్ సీతారామయ్య, ప్రియాంకల కుమారుడు త్రిలోక్య, ఆర్యల పేరిట ఆలయ అభివృద్ధి పనులకు రూ.1,00,005 విరాళం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

అధ్వానంగా కాట్లంపూడి రహదారి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కాట్లంపూడి రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైంది. రోడ్డు అంతంత మాత్రమే ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాలిపూడి, కాట్లంపూడి, ఇతర గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. అధికారులు స్పందించి ఈ గ్రామాల ప్రజల సౌకర్యార్థి రోడ్డు నిర్మించాలని కాట్లంపూడి ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్లకు స్టాండ్ లేక ఇబ్బందులు

- రోడ్డు పక్కనే నిలుపుదల
- ట్రాఫిక్‌కు అంతరాయం
- వాహనచోదకులకు అవస్థలు



పాత టోల్ గేట్ వద్ద నిలిపి ఉంచిన టిప్పర్లు



రోడ్డు పక్కనే నిలుపుదల చేసిన టిప్పర్లు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే టిప్పర్ వాహనాల పార్కింగ్‌కు స్టాండ్ లేకపోవడంతో ప్రధాన రహదారి పక్కనే వాటిని నిలిపి ఉంచుతున్నారు. గ్రావెల్ టిప్పర్లు ప్రధానంగా రాత్రి వేళల్లో తిరుగుతూ ఉంటాయి. ఇసుక టిప్పర్లు ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి నిత్యం ఏలూరు వస్తుంటాయి. వీటిని ఇసుక వినియోగదారులకు సరఫరా చేసేందుకు కొంత సమయం పడుతుండటంతో లోడు టిప్పర్లను రోడ్డు పక్కనే నిలుపుదల చేస్తున్నారు. టిప్పర్లకు స్టాండ్ లేకపోవడంతో తూర్పు లాకుల ప్రాంతంలోని పాత టోల్ గేట్ పక్కన నిలిపి ఉంచుతున్నారు.

స్టాండ్ కేటాయించాలి

ఏలూరు నగరానికి సంబంధించి ఆటో నగర్‌లో లారీ స్టాండ్‌లు రెండు ఉన్నాయి. ఇవి దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలకు సంబంధించినవి. స్థానిక పాత బస్టాండ్ కాలువ గట్టు వెంబడి ఐషర్ వ్యానులకు సంబంధించి మినీ లారీ స్టాండ్ ఉంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతి లేకపోవడంతో నగరం బయటే అవి ఉండాల్సి వస్తుంది.

రాకపోకలకు అవస్థలు

ఏలూరు నగరానికి వచ్చి పోయే టిప్పర్ల పార్కింగ్‌కు సరైన స్టాండ్ లేకపోవడంతో వాటి యజమానులు, డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో టిప్పర్‌లను బయటకు తీసే క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. మరి కొన్ని సందర్భాల్లో లోడ్ అధికంగా ఉండటంతో అదే రోడ్డు పక్కన ఇసుకను గుట్టలుగా పోసి ఉంచుతున్నారు. ఏలూరు నగరంలోకి ప్రవేశించే మార్గంలో ఇది ప్రధానమైన మార్గం కావడంతో రాకపోకలు సాగించే వారికి అవస్థలు తప్పడం లేదు.

టిప్పర్లకు స్థలం కేటాయించాలి



ఆశ్రం జంక్షన్ నుంచి పరిసర గ్రామాల నుంచి ఏలూరు నగరంలోకి ప్రవేశించే మార్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే టిప్పర్‌లను నిలుపుదల చేసేందుకు ప్రత్యేక ప్రాంతాన్ని కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు టిప్పర్‌లకు ప్రత్యేక స్టాండ్‌ను ఏర్పాటు చేయాలి.

– గారపాటి నాగేశ్వరరావు, ఏలూరు

ప్రజల కళ్లలో ఇసుక



టిప్పర్లను తూర్పు లాకుల సమీపంలోని పాత టోల్ గేట్ వద్ద రోడ్డు పక్కన నిలుపుదల చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో రోడ్డు పక్కన ఇసుక వేసి ఉంచడం వల్ల ఆ మార్గంలో ప్రయాణించే వారి కళ్లలో ఇసుక రేణువులు పడి ఇబ్బంది పడుతున్నారు.

– బొల్లారపు నాగరాజు, ఏలూరు

జనసేన స్థూపాన్ని తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహాత్మా గాంధీ స్మారక చిహ్నంగా ఎంతో చరిత్ర ఉన్న స్థానిక పడమర వీధి గాంధీ మైదానం ప్రదేశాన్ని జనసేన నాయకులు ఆక్రమించి జనసేన గాజు గ్లాసు గుర్తుతో నిర్మించిన స్థూపాన్ని వెంటనే తొలగించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్‌లకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాజనాల రామ్మోహన్ రావు, సొంటి నాగరాజు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

కామవరపుకోట: స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 2026 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ కె.విజయబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదు, ఆగస్టు 31న సీట్ల కేటాయింపు ఉంటుందని, సెప్టెంబర్ 1 నుంచి తరగతుల ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే ఉచితంగా హాస్టల్ సదుపాయం ఉంటుందని, ఎన్ఎస్ఎస్ విభాగం, మహిళా సాధికారత విభాగం, స్టడీ అవర్స్, డిజిటల్ క్లాస్ రూమ్, గ్రంథాలయం సదుపాయం ఉందని వివరించారు.

ఆహార ఉత్పత్తుల పంపిణీ



ఆహార ఉత్పత్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెంలో శుక్రవారం ఏపీ సీఎంఎఫ్ వింగ్ ఆధ్వర్యంలో ఆరోగ్య, పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల కుటుంబాలకు, వృద్ధులకు, నిరుపేదలు, నిరుద్యోగులకు ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న 81 కుటుంబాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఒక బాస్కెట్ చొప్పున ధాన్యాలు, పప్పు, బెల్లం, తదితర వస్తువులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఐటీడీఏ ఎస్ఎఫ్ఏ హుస్సేన్, మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ పద్మనాభం, డివిజన్ ఎంటీ వెంకటేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఆటవిడుపు ఉండాలి

ద్వారకాతిరుమల: నిత్యం వార్తల సేకరణలో ఉండే జర్నలిస్టులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలంటే ఆటవిడుపు ఉండాలని, అదే లక్ష్యంతో జర్నలిస్టుల స్పోర్ట్స్ అసోసియేషన్ (జేశాప్) పని చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి పి.రవికుమార్ అన్నారు. ద్వారకాతిరుమలలోని ఒక అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన జేశాప్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభలో రవి కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా జేశాప్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బంకా వెంకట తారక రామారావు, ప్రధాన కార్యదర్శిగా బొండాడ నాగబాబు, కోశాధికారిగా కమ్మ నాగేంద్ర కుమార్‌లను ఎన్నుకున్నారు. జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొడియం ప్రసాద్, సునీల్, రాంబాబు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

1న చేతి వృత్తిదారుల ధర్నా

ఏలూరు (టూటౌన్): చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో చేతివృత్తిదారుల సమావేశం నగర సంఘం ఏలూరు జిల్లా నాయకులు తాడిశెట్టి కాటమరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వివిధ కార్పొరేషన్ల నుంచి వృత్తిదారులకు 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని, సామాజిక రక్షణ చట్టం చేయాలని, అధునాతన పరికరాలు అందించాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని, బెల్ట్ షాపులు తొలగించాలని, గీత కార్మికులకు రక్షణ కల్పించాలని, నీర పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. రజక వృత్తిదారుల వృత్తి చెరువులపై పూర్తి హక్కు కల్పించాలని, గొర్రెలు, మేకల పెంపకం దారులకు వ్యాక్సిన్ ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయిన వృత్తిదారునికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తాడిశెట్టి కాటంరాజు, బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, వడ్రం పనివాళ్ల సంఘం జిల్లా కార్యదర్శి కెల్లా దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	112
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	32	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	24-28	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-24	పుదీనా	05
అనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో జనసేవాదళ్ శిక్షణ శిబిరం హనుమాన్ నగర్ ఫ్లాట్లలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా, మతోన్మాద శక్తుల ఆగడాలకు వ్యతిరేకంగా, ప్రజలకు రక్షణ కల్పించడానికి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం అందించడానికి జనసేవాదళ్ కార్యకర్తలు పని చేస్తారని చెప్పారు. జిల్లా సమితి అందించిన యూనిఫామ్‌ను రెడ్ షర్ట్ వాలంటీర్లకు అందించారు.

పునరావాస గ్రామంలో అన్నీ సమస్యలే

కుక్కునూరు: పునరావాస కాలనీలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు కూరగాయలు ఇవ్వడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ విమర్శించారు. శుక్రవారం సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా నాయకులు కుక్కునూరు మండలంలోని దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ప్రభుత్వం లచ్చిగూడెంలోని 174 కుటుంబాలకు ఆర్అండ్ఆర్ నష్టపరిహార ప్యాకేజీ నేటికీ ఇవ్వలేదన్నారు. నెమలిపేట పునరావాస కాలనీలో 174 ఇళ్లలో నాలుగు ఇళ్లకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని తెలిపారు. ఈ గ్రామంలో మంచినీటి బోర్ల నుంచి వచ్చే ఎర్రనీరు తాగడానికి పనిచేయడంలేదని అన్నారు. కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్టు ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు కంగాల కల్లయ్య, ఎస్కే మున్ని, సున్నం భీమరాజు, మచ్చా లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బృందానికి ఘన స్వాగతం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో డీఎన్ఆర్, జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి ప్రతినిధుల బృందానికి ఏలూరులో ఘన స్వాగతం లభించింది. ఈ బృందంలో ఉన్న మాజీ మంత్రులు సాకే శైలజానాథ్, పేర్నినాని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, ఇజ్రాయేల్, ఉంగుటూరు, పోలవరం, చింతలపూడి సమన్వయకర్తలు పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, కంభం విజయరాజుకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఆధ్వర్యంలో ఏలూరు నియోజకవర్గంలోని నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. వీరంతా జేపీ ఇంటిలో తేనీరు స్వీకరించారు. ఏలూరు జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీ ప్రతినిధుల బృందం రాకతో ఏలూరులో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, రాష్ట్ర నాయకులు దాసరి రమేష్, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, కార్పొరేటర్లు పైడి భీమేశ్వరరావు, తంగెళ్ల రాము, గ్జేవియర్ మాస్టారు, మాజీ కార్పొరేటర్ జిజ్జువరపు రమేష్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల నాగవెంకట బాచి తదితరులు ఉన్నారు.





మాజీ మంత్రి పేర్ని నానికి స్వాగతం పలుకుతున్న జేపీ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో మహిళా నేతలు విజయనిర్మల, కేదారేశ్వరి, తుమరాడ స్రవంతి

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు





గాజుల అలంకరణలో పత్తేబాద కనకదుర్గమ్మ, పసుపుకొమ్ముల అలంకర



తంగెళ్లమూడి కనకదుర్గమ్మ ఆలయంలో వ్రతమాచరిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు సుప్రభాత సేవ, నిత్యార్చనలు చేసి పంచామృత అభిషేకాలు చేశారు. అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. లలితాసహస్ర నామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణాలు నిర్వహించారు. పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి గాజులతో, తంగెళ్లమూడి సీతారామనగర్ చెరువుగట్టుపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీల ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సత్యసాయి మంచినీటి కార్మికుల సమ్మె



కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

పోలవరం రూరల్: పోలవరం మండలం కన్నాపురం అడ్డరోడ్డులో సత్యసాయి మంచినీటి పథకం వద్ద కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించి, జీతాల కోసం సమ్మెలోకి దిగారు. మానవహారంగా ఏర్పడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలలుగా జీతాలు అందడంలేదని, అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోయరు. 17 మండలాల్లో సుమారు 6 లక్షల మందికి తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు కూడా అందజేశామని కార్మికుల అధ్యక్షులు జి.శివసత్యనారాయణ చెప్పారు. జీతాలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. కొయ్యలగూడెంకు చెందిన పనసకాయల నాగేశ్వరరావు (53), అతని భార్యకు డబ్బుల విషయంలో గొడవలు ఉన్నాయి. 6 నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న నాగేశ్వరరావు ఈనెల 21న ఎలుకల మందు తాగాడు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతిచెందారు. నాగేశ్వరరావు తండ్రి పనసకాయల సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

వర్షాకాలంలో పశువుల ఆరోగ్యం జాగ్రత్త



ఆవుకు టీకా వేస్తున్నడాక్టర్ అపురూప

కొయ్యలగూడెం: వర్షాకాలంలో పశువుల ఆరోగ్యానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని యర్రంపేట వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పి.అపురూప సూచించారు. యర్రంపేటలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే గొంతువాపు, జబ్బ వాపు, పొదుగు వాపుల నివారణకు టీకాలు వేయించాలని, పశువుల పాకల్లో బ్లీచింగ్ పౌడర్, ఇసుక, ముగ్గు కలిపిన మిశ్రమాన్ని, కలరా ఉండలు కలిపిన ద్రావకాన్ని చల్లాలని సూచించారు. పాకల వద్ద మెస్, దోమ తెరలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జూన్ నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు పశువులు ఎదకు వచ్చే సమయమని, వాటిని సకాలంలో గుర్తించి గర్భధారణకు చర్యలు తీసుకోవాలి అన్నారు. పశువులు ఈనిన తర్వాత దూడలకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలని అన్నారు. పశువులకు పచ్చిరొట్ట, పచ్చి ఎండు గడ్డి సమాన స్థాయిలో కలిపి సమీకృత దాణా ఇస్తుండాలని అన్నారు. బాహ్య పరాన్న జీవుల నుంచి రక్షణకు భూటాక్స్ మందు నాలుగు నుంచి ఐదు మిల్లీలీటర్ల మందులు లీటర్ నీటిలో కలిపి పశువులు ఉండే పరిసర ప్రాంతాలు, పశువులపై 10 రోజులకు ఒకమారు చల్లుతూ ఉండా లని సూచించారు. వ్యాధి బారిన పడిన అనుమానం కలిగితే మిగిలిన పశువుల నుంచి దానిని దూరంగా ఉంచి, పశువైద్యుల్ని సంప్రదించాలన్నారు.

యువతను డ్రగ్స్ నుంచి కాపాడండి

జంగారెడ్డిగూడెం: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని, యువతరాన్ని కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.